సాక్షి
ప్రకాశం

ఆదివారం । 3 । మార్చి । 2024

I



విద్యతోనే ఉజ్వల భవిష్యత్

చదువుకు పేదరికం అడ్డుకాదని, విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు.

- IIలో..



స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు.

- IIలో..

గరిష్టం/కనిష్టం
34/23

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఏబీపీ ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు అర్బన్: ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం (ఏబీపీ) కింద కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చీఫ్‌ప్లానింగ్ ఆఫీసర్ (సీపీవో) వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌తో పాటు కంప్యూటర్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండి 18 నుంచి 42 ఏళ్ల వయసు మధ్య వారై ఉండాలన్నారు. యర్రగొండపాలెం మండల ఏబీపీగా విధులు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.55 వేల వేతనం ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సీనియర్ ఇంటర్ పరీక్షకు 954 మంది గైర్హాజరు



ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు: సీనియర్ ఇంటర్ తొలి పరీక్షకు శనివారం 954 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష జరుగుతున్న తీరును కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్వయంగా పరిశీలించారు. స్థానిక ఉమామహేశ్వర కాలేజీలోని సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారు, మౌలిక వసతుల సౌకర్యాలను పరిశీలించడంతోపాటు మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్ష నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్లను ఆదేశించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జనరల్ విభాగంలో 16,479 మందికిగాను 15,846 మంది, ఒకేషనల్ విభాగంలో 2,603 మందికిగాను 2,282 మంది హాజరయ్యారు. మొత్తంగా 19,082 మందికిగాను 18,128 మంది మాత్రమే హాజరయ్యారు. ఆర్‌ఐవో నాలుగు పరీక్ష కేంద్రాలు, డీఈసీ, డీఐఈవోలు 4, స్క్వాడ్ బృందాలు 42 సెంటర్లను తనిఖీ చేశాయని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని ఆర్‌ఐవో ఎ.సైమన్ విక్టర్ తెలిపారు.

టెట్ పరీక్షలకు 63 మంది గైర్హాజరు

ఒంగోలు: టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు (టెట్) పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 63 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. స్థానిక నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చెస్ యాక్షన్ ఇండియాలో ఉదయం పూట ఒక సెషన్ మాత్రమే పరీక్ష జరిగింది. 240 మందికిగాను 217 మంది హాజరయ్యారు. స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఉదయం జరిగిన పరీక్షకు 150 మందికిగాను 118 మంది, సాయంత్రం జరిగిన పరీక్షకు 150 మందికిగాను 142 మంది హాజరయ్యారు. మొత్తంగా శనివారం జరిగిన పరీక్షకు 63 మంది గైర్హాజరైనట్లు డీఈవో డి.సుభద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్‌బీకేలో ఈ-క్రాప్ ముసాయిదా జాబితా

ఒంగోలు సెంట్రల్: రబీలో సాగైన పంటల ఈ-క్రాప్ ముసాయిదా జాబితాలను జిల్లాలోని అన్ని ఆర్‌బీకేలలో ప్రదర్శనకు ఉంచారని వ్యవసాయశాఖ జేడీఏ ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. రబీ సీజన్‌లో మొత్తం 3.01 లక్షల ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు చేశారని చెప్పారు. అందుకు సంబంధించిన జాబితాలను ఈనెల 3 వరకు ఆర్‌బీకేలలో ప్రదర్శనకు ఉంచామన్నారు. గ్రామ సభలు కూడా నిర్వహించి వివరాలు తెలుపుతారన్నారు. అభ్యంతరాలు ఏవైనా ఉంటే సంబంధిత ఆర్‌బీకేలలో వీఏఏ, ఏవోలకు రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. వ్యవసాయాధికారి, తహశీల్దార్లు పరిశీలించి ఈనెల 5వ తేదీ తుది జాబితాలో చేర్చుతారని తెలిపారు. 2023-24 సీజన్‌కు సంబంధించి ఇది చివరి అవకాశం అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఏవైనా జాబితాలో మార్పులుంటే పరిశీలించి తెలియజేయాలని కోరారు.





ఎంపీ విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బీదా మస్తాన్‌రావు, బుర్రా





సిద్ధంకు సన్నద్ధం

ఈనెల 10న మేదరమెట్ల సమీపంలో నిర్వహించనున్న సిద్ధం సభ పోస్టర్ ఆవిష్కరణ, సన్నాహక సమావేశం ఒంగోలులో శనివారం నిర్వహించారు. ఒంగోలులోని వీకేబీ రెస్టారెంట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు, గుంటూరు, బాపట్ల జిల్లాల కోఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి, రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు పార్లమెంట్ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితోపాటు గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎంఎల్‌సీలు పాల్గొన్నారు. ముందుగా ఎంపీలు, ఎంఎల్‌సీలు, ఎంఎల్‌ఏలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, పరిశీలకులు, సమన్వయకర్తలతో విజయసాయిరెడ్డి భేటీ అయ్యారు. కార్యక్రమంలో మంత్రులు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, సాంఘిక సంక్షేమశాఖా మంత్రి మేరుగు నాగార్జున, భారీ నీటిపారుదల శాఖామంత్రి అంబటి రాంబాబు, వ్యవసాయ శాఖామంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణ, బీదా మస్తాన్‌రావు, మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎంఎల్‌సీలు పోతుల సునీత, తలశిల రఘురాం, తూమాటి మాధవరావు, శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్, కుందురు నాగార్జున రెడ్డి, అన్నా రాంబాబు, మేకపాటి విక్రమ్ రెడ్డి, దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి, చీరాల ఇన్‌చార్జి కరణం వెంకటేష్, వేమూరు ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, అద్దంకి ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ విభాగం ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– ఒంగోలు

నిండు జీవితానికి భరోసా..!

- నేడు పల్స్‌పోలియో
- 2,40,958 మంది చిన్నారులకు చుక్కలు
- అందుబాటులో 2.50 లక్షల వ్యాక్సిన్లు
- జిల్లాలో 1815 ప్రత్యేక కేంద్రాలు
- రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్సు డిపోల్లో శిబిరాలు
- జిల్లా అంతటా అవగాహన సదస్సులు, ర్యాలీలు





జెండా ఊపి పల్స్‌పోలియో అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు టౌన్/ఒంగోలు అర్బన్: జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 0 నుంచి 5 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. ఇందుకోసం 2.50 లక్షల వ్యాక్సిన్లను అందుబాటులో ఉంచారు. జిల్లా వ్యాప్తంగా 1815 కేంద్రాలు ఏర్పాటు చేశారు. సుమారు 7706 మంది సిబ్బందిని నియమించారు. జిల్లాలో 38 మండలాల్లో 2,40,958 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకుగాను 64 పీహెచ్‌సీ, 18 యూపీహెచ్‌సీ, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, బస్సు డిపోలు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పట్టణ ప్రాంతాల్లో 226, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో 1589 కేంద్రాలు ఏర్పాటు చేశారు.

బూత్‌స్థాయిలో 7260, మొబైల్ టీం 164, రైల్వే స్టేషన్లు, బస్ డిపోలలో 90 మందిని నియమించారు. ఇందుకోసం 1771 మంది వైద్య సిబ్బంది, 2589 మంది ఐసీడీఎస్, 2006 మంది ఆశా వర్కర్లు, 1340 మంది వలంటీర్లను కేటాయించారు. 2.50 లక్షల వ్యాక్సిన్‌లు ఇప్పటికే నిర్దేశిత ప్రాంతాలకు చేరుకున్నాయి.

పోలియో చుక్కలు వేయించండి:

ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి పి.పద్మజ పిలుపునిచ్చారు. బిడ్డలలో అంగవైకల్యాన్ని అడ్డుకునేందుకు ఏకైక మార్గం వ్యాక్సిన్ వేయించడమే అన్నారు. ప్రయాణాల్లో ఉన్న చిన్నారులకు సైతం వ్యాక్సిన్ వేయించేందుకు వీలుగా ఆర్టీసీ బస్‌స్టేషన్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో కూడా శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒంగోలులోని ముంగమూరు డొంకలో యూపీహెచ్‌సీ కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. రాజ్యలక్ష్మి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సింగరాయకొండలో ఉదయం 8 గంటలకు ఆర్టీసీ బస్టాండులో జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారు.

అవగాహన సదస్సులు, ర్యాలీలు

పల్స్‌పోలియోపై జిల్లా అంతటా అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ దినేష్‌కుమార్ ర్యాలీని ప్రారంభించారు. శనివారం ప్రకాశం భవనం వద్ద వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ జిల్లా వ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో ఐదేళ్ల వయసు నిండిన ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. అందుకు ప్రజలు కూడా పల్స్‌పోలియో కార్యక్రమంపై అవగాహన చేసుకుని చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. పోలియోను పారద్రోలేందుకు పోలియో చుక్కలే ఏకైక మార్గమన్నారు. జిల్లాలో నూరు శాతం పల్స్‌పోలియోను విజయవంతం చేస్తామని, అందుకు తగిన ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. ఇంటి వద్ద లేని వారి పిల్లలకు మరో రెండు రోజుల పాటు ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, వైద్యులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశావర్కర్‌లు, నర్సింగ్ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు.



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి, జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత తదితరులు

అవకాశాలు అందిపుచ్చుకోవాలి

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- తల్లి పేరుమీద ప్రతిభ అవార్డులు అందజేత

ఒంగోలు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు, కార్పొరేట్ విద్యార్థులకంటే మెరుగ్గా చదువుకునేందుకు అవసరమైన సౌకర్యాలు మెండుగా ప్రభుత్వం కల్పిస్తోందని, వాటిని వినియోగించుకుని ఉన్నతంగా రాణించడం విద్యార్థుల వంతు అని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక పీవీఆర్ బాలికోన్నత, బాలుర ఉన్నత పాఠశాలల్లో గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ శ్రేణిలో నిలిచిన విద్యార్థులకు ఆయన తల్లి రమాదేవి పేరుమీద శనివారం ప్రతిభ అవార్డులు అందించారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.50 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.25 వేలు చొప్పున రెండు పాఠశాలల్లోని నలుగురికి రూ.1.50 లక్షల నగదు అవార్డులు అందించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ పేదరికం విద్యార్జనకు భారం కారాదని, విద్యార్థి మానసిక స్థైర్యంతో చదువుకోవాలనే ఉద్దేశంతో పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పన కార్యక్రమం రూ.కోట్లు వెచ్చించి చేపడుతున్నారన్నారు. అంతేకాకుండా కార్పొరేట్ విద్యార్థులకు కూడా అందుబాటులో లేని బైజూస్ కంటెంట్‌ను అందిస్తున్నారని, చేతిలో ట్యాబ్‌లు, జగనన్న విద్యాకానుక కిట్లు అందించడం ద్వారా ప్రతి ఒక్కరూ కార్పొరేట్ విద్యార్థికంటే దీటుగా రాణించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా రాణించాలన్నారు. అనంతరం ఇదే కార్యక్రమానికి హాజరైన బచ్చల విష్ణు ప్రసాద్ మిత్రబృందం స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.12 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.7 వేలు అందించారు. చక్కా యతిరాజం స్మారక అవార్డు కింద చక్కా పద్మావతి రూ.10 వేలు, నాయని సత్యన్నారాయణ స్మారకార్థం నాయని సత్యవతి రూ.5 వేలు, ఉత్తమ విద్యార్థులుగా ఎంపిక చేసిన వారికి కార్పొరేటర్ ఢాకా సుజాతా హనుమారెడ్డిలు రూ.25 వేలు అందించారు. వీరితోపాటు జేవీ సుబ్బయ్య స్మారక అవార్డును కూడా విద్యార్థులకు సీతాలక్ష్మి బహూకరించారు. పాఠశాల హెచ్‌ఎం బంకా లక్ష్మీ ప్రసన్న ఆమె తండ్రి జ్ఞాపకార్థం గణితంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి రూ.5 వేలు బహూకరించగా , అదే పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు ఆరిగ ప్రతాప్ ఆంగ్ల సబ్జక్టులో మొదటి మూడు స్థానాల్లో అత్యధిక మార్కులు నిలిచిన వారికి నగదు బహుమతులు అందించారు. 1975 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు గత ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, కార్పొరేటర్లు నీలంరాజు సరోజ, తాడి కృష్ణలత, పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కోసూరి రాధ, పాఠశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై అవగాహన ఉండాలి

- నిబంధనల మేరకు ఎన్నికల విధులు నిర్వహించాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ గోపాలకృష్ణ, ఏఎస్‌పీ నాగేశ్వరరావు

ఒంగోలు అర్బన్: భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలపై ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు పూర్తి అవగాహనతో ఉండాలని ఆ మేరకు మార్గదర్శకాలను క్షుణ్ణంగా చదువుకుని అర్థం చేసుకోవాల కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. శనివారం స్పందన భవనంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, నోడల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలు పక్కాగా పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ ప్రక్రియ నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల నియమావళిని అమలు చేయడం, అభ్యర్థుల ఖర్చు వివరాలు నమోదు చేయడం చాలా కీలకమైన అంశాలని అన్నారు. ఎటువంటి పొరపాట్లు లేకుండా ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించడంలో పోలింగ్ అధికారులది కీలకపాత్ర అన్నారు. ఎన్నికల విధులు కేటాయించిన ప్రతి ఒక్కరూ వారి బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించాలన్నారు. ఎన్నికల విధులకు సంబంధించి ఏ సందేహం ఉన్నా వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులు వారి బృందాల్లోని అధికారులను ఎన్నికలకు పూర్తి స్థాయిలో సంసిద్ధం చేసేలా బాధ్యత తీసుకోవాలన్నారు. అభ్యర్థుల ఖర్చు వివరాలను ఎప్పటికప్పుడు ఎక్స్‌పెండేచర్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఎక్స్‌పెండేచర్ మాన్యువల్‌ను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలన్నారు. ప్రతి అంశాన్ని అబ్జర్వర్లు నిశితంగా పరిశీలిస్తారని, ఎన్నికల సిబ్బంది తమ బాధ్యతలను అర్థం చేసుకుని విధులు నిర్వహించాలన్నారు. నోడల్ అధికారులు ఎన్నికల విధులపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలన్నారు. తొలుత ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు ఎన్నికల నిర్వహణలో నామినేషన్ ప్రక్రియ నుంచి చేపట్టాల్సిన విధులపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పర్యటన ఏర్పాట్లకు స్థల పరిశీలన

- స్థలాన్ని పరిశీలించిన మంత్రి సురేష్, కలెక్టర్, తాటిపర్తి

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి యర్రగొండపాలెంలో పర్యటించనున్న సందర్భంగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, కలెక్టర్ దినేష్ కుమార్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం స్థల పరిశీలన చేశారు. స్థానిక త్రిపురాంతకం రోడ్డులోని రెయిన్‌బో హైస్కూల్, మాచర్ల రోడ్డుల్లో ఉన్న ఖాళీ స్థలాలను వారు పరిశీలించారు. ఈ నెల 6వ తేదీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దోర్నాల మండలంలోని కొత్తూరులో పూర్తయిన వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్ పైలాన్ ప్రారంభిస్తారు. అనంతరం అక్కడి నుంచి హెలికాప్టర్‌లో యర్రగొండపాలెం చేరుకొని రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నగదు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని చేపడతారని సమాచారం. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి సీఎం మాట్లాడుతారు.



స్థల పరిశీలన చేస్తున్న మంత్రి సురేష్, కలెక్టర్ దినేష్ కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రశేఖర్

స్థల పరిశీలన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అపావ్, మార్కాపురం డీఎస్పీ బాలసుందరం, ఐటీడీఏ పీవో బి.రవీంద్రరెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ దుగ్గెంపూడి వెంకటరెడ్డి, ఎంపీపీలు దొంతా కిరణ్‌గౌడ్, కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

- ఉచిత వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో మంత్రి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: స్వచ్ఛంద సేవా సంస్థలు దాతృత్వంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం సంతోషకరమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజక వర్గ ఇన్చార్జి మేరుగు నాగార్జున అన్నారు. స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉప్పుగుండూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. శిబిరంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మేరుగు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఉచితంగా అందించే ఇలాంటి వైద్య సేవలు చాలా ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. ఉచితంగా మందులు కూడా అందించడం సంతోషకరమన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో ఇలాంటి వైద్య శిబిరాల నిర్వహణకు తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన స్ఫూర్తి ఫౌండేషన్ సంస్థ చైర్మన్ బి.వి.రావు సేవలను అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మద్దిపాడు ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కొలకలూరి విజయకుమార్, నాయకులు మాదాసు బాబు, ఉప్పుగుండూరి శ్రీనివాస ప్రసాద్, మున్నంగి వెంకట్రావు, కొంజేటి సురేష్, పెంట్యాల శ్రీనివాసరావు, కుమ్మరి సుధాకర్, ప్రవీణ్, వజ్రం బాబు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- చెన్నిపాడులో రూ.1.33 కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదులు ప్రారంభం
- మన బడి, నాడు-నేడుతో మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు



అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పొన్నలూరు: చదువుకు పేదరికం అడ్డుకాదని, విద్యతోనే ప్రతి వ్యక్తికి ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని చెన్నిపాడు పాఠశాలలో మన బడి, నాడు-నేడు పథకం ద్వారా రూ.1.33 కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదులను శనివారం మంత్రి ప్రారంభించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వెన్నపూస చెన్నారెడ్డి, వెన్నపూస రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు, విద్యార్థులు కలిసి మంత్రి సురేష్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి సురేష్ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే రాష్ట్రంలో మనబడి, నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. మనబడి, నాడు-నేడు ద్వారా రాష్ట్రంలో రూ.17 వేల కోట్లతో 15 వేల పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, డిజిటల్ తరగతులు, బాలబాలికలకు విడివిడిగా మరుగుదొడ్లు, తాగునీటి వసతి, తరగతి గదుల్లో బల్లలు, బోర్డులు వంటి అధునాతన వసతులు ఏర్పాటు చేసి రూపురేఖలు మార్చారన్నారు. అలాగే, కొండపి నియోజకవర్గంలో రెండు విడతల్లో రూ, 44.6 కోట్లతో 328 పాఠశాలలను అభివృద్ధి చేసి వసతులు ఏర్పాటు చేశారన్నారు.

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి పేద వర్గాల విద్యార్థులకు విద్యా భరోసా కల్పించారని మంత్రి సురేష్ తెలిపారు. అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యా దీవెన, జగనన్న విద్యా కానుక వంటి నూతన పథకాలు ప్రవేశపెట్టి దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న పేద విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి, ఇంగ్లిష్ మీడియం, విద్యలో ఆధునికత, సాంకేతిక విజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బైజూస్‌తో ఒప్పందం చేసుకుని ట్యాబ్‌లు అందజేశారన్నారు. చదువుతోనే పేదల జీవితాలు బాగుపడతాయని నమ్మి రాష్ట్రంలో విద్యకు పెద్దపీట వేశారని మంత్రి సురేష్ కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, మండల మాజీ కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ గుత్తి శారమ్మ, సంగమేశ్వరం ట్రస్ట్ బోర్డు చైర్మన్ వెన్నపూస మాల్యాద్రిరెడ్డి, వెన్నపూస శ్రీనివాసులురెడ్డి, వెన్నపూస మాల్యాద్రిరెడ్డి, వెన్నపూస పుల్లారెడ్డి, గుత్తి భాస్కర్, ఎదురు బాల అంజిరెడ్డి, ఎదురు రాజారెడ్డి, రావిపాటి మాలకొండయ్య, హెచ్‌ఎం వేణుగోపాల్, ఎంఈఓలు రవిచంద్ర, హరిబాబు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి



బుల్లెట్‌పై ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అన్నా



దివ్యాంగునికి ట్రైసైకిల్ అందిస్తున్న ఎమ్మెల్యే అన్నా, జంకె

- మార్కాపురంలో ప్రచారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: మన ప్రియతమ నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మార్కాపురం నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నిలబడుతున్న అన్నా వెంకట రాంబాబు, ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం అభ్యర్థి అన్నా రాంబాబు శనివారం సాయంత్రం ప్రచారాన్ని ప్రారంభించారు. కంభం రోడ్డులోని నాగులపుట్ట ఆంజనేయస్వామి గుడి వద్ద జంకె వెంకటరెడ్డితో కలిసి పూజలు నిర్వహించి బైక్ ర్యాలీగా కంభం సెంటరు, కోర్టు సెంటర్, సబ్‌కలెక్టర్ ఆఫీసు, పూలసుబ్బయ్య కాలనీ మీదుగా చెన్నరాయుని పల్లి వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా చెన్నరాయునిపల్లిలో పాంప్లెట్లను అందించి మాట్లాడారు. 2009 నుంచి ఇప్పటివరకు గిద్దలూరు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేశాననీ, ప్రజల అభిమానంతో 2019లో అక్కడి ప్రజలు రాష్ట్రంలోనే జగనన్న తరువాత అత్యధిక మెజారిటీని ఇచ్చి అసెంబ్లీకి పంపారన్నారు. మార్కాపురాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు.

పూలు.. హారతులతో ఘనస్వాగతం

మొదటిసారిగా మార్కాపురం పట్టణంలో ప్రచారాన్ని ప్రారంభించిన అన్నా రాంబాబుకు ప్రజలు ఘనస్వాగతంపలికారు. చెన్నరాయునిపల్లిలో పూలుజల్లి, హారతులు ఇచ్చి ఇంటింటి వద్ద తన అభిమానాన్ని చాటుకున్నారు. అన్నా రాంబాబు స్వయంగా బుల్లెట్ నడుపుతూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు. జై రాంబాబు... జైజై జగన్... అనే నినాదంతో పట్టణంలోని ప్రధానవీధులన్నీ మార్మోగాయి. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఏఎంసీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, పలు విభాగాల నేతలు గుంటక సుబ్బారెడ్డి, గొలమారి శ్రీనివాసరెడ్డి, షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, పి. మురళి, పీఎల్‌పీ యాదవ్, డాక్టర్ మక్బూల్ బాషా, నజీర్ అహ్మద్, పెరుమాళ్ల కాశీరావు, పెనుకొండ కేశవరావు, అరుణా చెంచిరెడ్డి, హర్షిత, బుర్రి ఎల్లమ్మ, శిరాజ్, కొత్త కృష్ణ, దొడ్డ భాగ్యలక్ష్మి, రంగలక్ష్మి, రోజ్‌లిడియా, వనజాక్షి, కె.దుర్గ, షేక్ భాను, చాటకొండ చంద్ర, అమీరుల్లాఖాన్, ఎల్లమ్మ కాటమయ్య, గురవయ్య, బాలకృష్ణ, బి. తిరుపతిరెడ్డి, రంగారెడ్డి, పంబి వెంకటరెడ్డి, మందటి శివారెడ్డి, బొగ్గరపు శేషయ్య, బూదాల సతీష్, నాలి రజనీ, ఎల్. శేఖర్, సుధీర్, రంగస్వామిగౌడ్ పాల్గొన్నారు. కాగా ప్రచారంలో భాగంగా కోర్టుసెంటరులో ఎమ్మెల్యే అన్నా రాంబాబు దివ్యాంగునికి ట్రైసైకిల్ అందజేశారు.

గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశానికి ఆహ్వానం



జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ రాజారావు

టంగుటూరు: జిల్లాలోని మహాత్మ జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలు 2024- 25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశానికి ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ కె. రాజారావు తెలిపారు. స్థానిక బాలుర గురుకుల పాఠశాలలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ కొండపి (టంగుటూరు బాలురు), టంగుటూరు (ఫిషరీస్/ బాలికలు), మార్కాపురం (బాలికలు), కినిగిరి (బాలికలు), యర్రగొండపాలెం (దరిమడుగు, బాలురు) పాఠశాలల్లో 2024- 25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుకునే వారికి దరఖాస్తు చేసుకునేందుకు 1 మార్చి నుంచి 31 మార్చి వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పేరు పుట్టిన తేదీ, తండ్రి/ సంరక్షకుల ఫోన్ నంబరు, తదితర ప్రాథమిక వివరాలతో పాటు రూ. 100 చెల్లిస్తే జనరల్ నంబర్ వస్తుందన్నారు. వివరాలు.. 2023-24 సంవత్సరంలో 4వ తరగతి తప్పనిసరిగా ఉత్తీర్ణత అయ్యి ఉండాలి. బీసీ, ఈబీసీ విద్యార్థులకు 9 సంవత్సరాలకు మించి ఉండకూడదు. 01 సెప్టెంబర్ 2013 నుంచి 31 ఆగస్టు 2015 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 9 నుంచి 13 సంవత్సరాలు మించి ఉండకూడదు. 01 సెప్టెంబర్ 2011 నుంచి 31 ఆగస్టు 2015 మధ్య జన్మించి ఉండాలి. ఈ నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. కొండపి (టంగుటూరు బాలురు) 40 సీట్లు ఖాళీగా ఉన్నాయి. వివరాలకు ప్రిన్సిపాల్ కె. రాజారావు ఫోను 9515121249 ను సంప్రదించవచ్చు. టంగుటూరు (ఫిషరీస్/ బాలికలు), 40 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ప్రిన్సిపాల్ కె. భ్రమరాంబ ఫోన్ 9703175895ను సంప్రదించాలి. మార్కాపురం (బాలికలు), 80 సీట్లు ఉండగా ప్రిన్సిపాల్ సునీత ఫోను 7702411446ను, కనిగిరి (బాలికలు), 40 సీట్లు ఖాళీ ఉండగా ప్రిన్సిపాల్ ఏ. హరిబాబు ఫోను 9441130614ను సంప్రదించవచ్చు. యర్రగొండపాలెం (దరిమడుగు, బాలురు) 40 సీట్లు ఉన్నాయి. ప్రిన్సిపాల్ టి. ఎం. శ్రీనివాసబాబు ఫోను 7286969849 నంబర్‌ను సంప్రదించవచ్చు.

రూ.82 లక్షలు ఏం చేశారు?

- కనీసం ఫ్యాన్‌లు కూడా లేవు
- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్



జీజేసీలో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాశ్

పొదిలి: 'పరీక్ష కేంద్రాల్లో కనీసం ఫ్యాన్‌లు కూడా లేవు, కళాశాల రూముల్లో కనీస వసతులు లేవు, బాత్‌రూంల నుంచి దుర్గంధం వస్తోంది. పిల్లలు ఈ రూముల్లో పరీక్షలు ఎలా రాస్తారు? కళాశాల అభివృద్ధికి వచ్చిన రూ.82 లక్షలు ఏం చేశారు' అని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీలను పరిశీలించారు. అనంతరం కేజీబీవీ బాలికలతో మాట్లాడి.. వసతులపై ఆరా తీశారు. డీఈఓ సుభద్ర, డీఐఈఓ ఐ.శ్రీనివాసరావు, ఆర్ఐఓ సైమన్ విక్టర్, ఆర్‌జేడీ పరమేశ్వరరెడ్డి, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, నాగలక్ష్మి, పరీక్ష కేంద్రాల పర్యవేక్షాధికారి షకీనాబీ, ప్రత్యేక అధికారి అనూరాధ పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరిస్తా



కలెక్టర్ దినేష్‌కుమార్‌తో చర్చిస్తున్న తాటిపర్తి

యర్రగొండపాలెం: నల్లమల అడవుల్లో నివశించే గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్, సీఎం పర్యటన స్థల పరిశీలనకోసం వచ్చిన కలెక్టర్‌ను కలిసి గిరిజనుల సమస్యలను తీసుకొని వెళ్లారు. దీంతో కలెక్టర్.. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అపావ్, శ్రీశైలం ఐటీడీఏ పీవో బి.రవీంద్రరెడ్డిలతో గిరిజన గూడేల్లో ఉన్న సమస్యలపై చర్చించారు. చంద్రశేఖర్ మాట్లాడుతు పెద్దదోర్నాల మండలంలోని చింతల, తుమ్మలబైలు, గారపెంట చెంచు గూడెంలో నిర్మించుకుంటున్న గృహాలు అర్థాంతరంగా నిలిచిపోయాయని, నీటి సమస్యను వారు ఎదుర్కొంటున్నారని, రోడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించి గిరిజనులను ఆదుకోవాలని కోరారు. అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులను అటవీ శాఖాధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని, తమ గూడెంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు వారు అడ్డు తగులుతున్నారని ఆయన వారి దృష్టికి తీసుకొని వెళ్లారు. వెంటనే ఆయా ప్రాంతాల్లోని గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ వారం రోజుల్లో పట్టాల పంపిణీ చేస్తామని, గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఆర్టీసీ బస్‌కు తప్పిన ముప్పు



ఆగిన బస్సు వద్ద ప్రయాణికులు

పొదిలి: డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో గిద్దలూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. గిద్దలూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఒంగోలు వైపు వెళుతోంది. ఈక్రమంలో శనివారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్దకు వచ్చేసరికి, కుడివైపు ఫ్రంట్ టైర్ నుంచి పొగ, మంటలు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ రమేష్ బస్సును రోడ్డు పక్కగా ఆపి, ప్రయాణికులను హుటా హుటిన దించేశారు. డ్రమ్స్ పట్టేయటం మూలంగా ఇలా జరిగి ఉంటుందని డ్రైవర్ రమేష్ తెలిపారు. ప్రయాణికులను మరో బస్సులో ఒంగోలు తరలించారు.

భారీ అగ్నిప్రమాదం

- పొగాకు బ్యారన్లు, గుడిసెలు దగ్ధం
- సుమారు రూ. 3 లక్షల ఆస్తి నష్టం



కట్టుబడిపాలెంలో తగలబడుతున్న గుడిసెలు

కొండపి (మర్రిపూడి): విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా రెండు పొగాకు బ్యారన్లు, 10 గుడిసెలు తగలబడగా సుమారు 3 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిన సంఘటన శనివారం ఉదయం కొండపి మండలం కట్టుబడిపాలెంలో జరిగింది. రైతు అనుమోలు వెంకటేశ్వర్లుకు చెందిన రెండు బ్యారన్లలో పొగాకు క్యూరింగ్ జరుగుతోంది. ఇందుకోసం 10 కుటుంబాలను కూలీకి తెచ్చుకుని ఆ బ్యారన్ల వద్దే గుడిసెలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నారు. ఉదయం విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా బ్యారన్ల వద్ద ప్లాస్టిక్ పట్ట అంటుకుని తగలబడటంతో అక్కడే ఉన్న క్యూరింగ్ చేసిన పొగాకు తగలబడి మంటలు రేగి సమీపంలోని గుడిసెలు కూడా తగలబడ్డాయి. గుడిసెల్లో ఉన్న 5 సిలిండర్లు కూడా తగలబడటంతో పెద్ద ఎత్తున పేలుళ్లు సంభవించాయి. దీంతో ఈప్రాంతంలో కొంతసేపు ఏం జరుగుతుందో అర్థం కాక ఒక్కసారిగా భయానక వాతావరణం నెలకొంది. అదృష్టవశాత్తు ఆ సమయంలో గుడిసెల్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సకాలంలో మంటలు ఆర్పామని టంగుటూరు ఫైర్ ఆఫీసర్ ఏ. రమణారెడ్డి వివరించారు. సిబ్బంది బి. పాల్, సీహెచ్ బంగారుబాబు, పి. ఏశోబు సహాయ చర్యలో పాల్గొన్నారు.

50 కేజీల గంజాయి స్వాధీనం

టంగుటూరు: విజయవాడ నుంచి చైన్నై వైపు తరలిస్తున్న గంజాయిని పోలీసులు స్థానిక టోల్ ప్లాజా వద్ద శనివారం స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు సెబ్ సీఐ వంశీధర్, టంగుటూరు ఎస్సై నాగేశ్వరరావు విజయవాడ నుంచి చైన్నై వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేయగా అందులో ఒక వ్యక్తి బ్యాగులో 50 కేజీల గంజాయి గుర్తించారు. అతనితోపాటు, గంజాయిని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు.

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

గిద్దలూరు రూరల్: పట్టణంలోని చిన్న మార్కెట్ సమీపంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం జరిగింది. అందిన వివరాల ప్రకారం ఏ.అనిత (28) కుటుంబ కలహాల కారణంగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. భర్త రంగస్వామి ఓ ప్రైవేటు వైద్యశాలలో కాంపౌండర్‌గా పనిచేస్తుంటాడు. వీరికి ఇద్దరు కుమారులున్నారు.

108లో ప్రసవం



శిశువును అమ్మమ్మకు అందిస్తున్న ఈఎంటీ ఏసుపాదం

చీమకుర్తి: మండలంలోని ఇలపావులూరుకు చెందిన మందా స్రవంతి శనివారం 108 అంబులెన్స్‌లో పండంటి బాబుకు జన్మనిచ్చింది. స్రవంతికి నొప్పులు రావడంతో ఒంగోలు రిమ్స్‌కు తరలిస్తున్న సమయంలో మల్లవరం వద్దకు వెళ్లేసరికి కాన్పు జరిగినట్లు ఈఎంటీ ఏసుపాదం తెలిపారు. ఎదురుకాళ్లతో శిశువు జన్మించినా ఎలాంటి ప్రమాదం లేకుండా సాధారణ కాన్పు చేసిన ఈఎంటీని స్రవంతి బంధువులు అభినందించారు. పుట్టిన బిడ్డ, తల్లి సురక్షితంగా ఉన్నారని, బిడ్డను అమ్మమ్మకు అప్పగించామని ఏసుపాదం తెలిపారు.